

## వైతాళికుల పథనిర్దేశం...



భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి చాలా శీఘ్రంగా జరుగుతుంది. నీళ్లలో మనవాటా తేలిన తర్వాత జలవనరుల విషయంలో స్వేచ్ఛ ఉంటుంది. స్వయంపాలనలో శాసిస్తాం. తెలంగాణ వస్తే మొదట చెరువులను పునరుద్ధరించాలి. గ్రామీణ వ్యవస్థ సస్యశ్యామలం అవుతుంది. తెలంగాణలో ఇవన్నీ సాధ్యమే. ఎందుకంటే తెలంగాణ ప్రజల్లో ఆ చైతన్యం ఉన్నది కనుక.

**■ ఆచార్య కొత్తపల్లి జయశంకర్,**
తెలంగాణ సిద్ధాంతకర్త



తెలంగాణకు ఉన్నది ఒకే ఒక పరిష్కారమార్గం. అది గోదావరి ఒక్కటే. ఈ నదికి ఉపనదులుగా ఉన్న ప్రాణహిత, ఇంద్రావతిలో లభించే నీరు మాత్రమే మనల్ని బతికిస్తుంది. మేం 954 టీఎంసీల గోదావరి నీళ్లు హక్కుభుక్తంగా కలిగి ఉన్నాం. నీటి పారుదల మీద 50– 60 శాతం ఖర్చుపెట్టామని నాటి పాలకులు చెప్పారు. కనీసం ఏడు శాతం నీళ్లయినా ఇచ్చారా?

**■ ఆర్. విద్యాసాగర్‌రావు,**
కేంద్ర జల సంఘం, మాజీ చైర్మన్



ఉద్యమాలన్నింటిలో తెలంగాణ ఉద్యమం మాత్రమే విజయం సాధించింది. 1952.. 1969 నుంచి కేసీఆర్ పార్టీ పెట్టి (దీన్నే మలిదశ లేదా తుదిదశ అంటున్నాం) తరువాత హింసకు తావులేకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాలో ఉద్యమాన్ని నడిపించటం అనే వ్యూహంతో విజయవంతంగా జరిగిన ఉద్యమం. అయితే, దేశంలో జరిగిన ఉద్యమాలన్నీ సెక్టోరియల్ మూవ్‌మెంట్స్ (వర్గసమూహం ఆధారంగా సాగిన ఉద్యమాలు). ఉదహరణకు ఈశాన్యభారతంలో బోడోల పోరాటం, పంజాబ్‌లో సిక్కులు... కానీ, తెలంగాణ ఉద్యమానిది మాత్రం విశాల ప్రాతిపదిక. సబ్బండ వర్గాల ఆకాంక్షలు ప్రతిఫలించిన ఉద్యమం. సమాజంలో ప్రజల అందరి భాగస్వామ్యంతో జరిగిన పోరాటం. ఉద్యమ ఆకాంక్షతోపాటు ఉద్యమాన్ని నడిపిన వ్యూహం కూడా ఆదర్శప్రాయమైంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే మహాలక్ష్య సాధనలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలతో కలిసి పొలిటికల్ ఫ్రంట్‌గా ఏర్పడటం, విద్యార్థులు, వృత్తి నిపుణులు, కుల సంఘాలు, కళాకారుల భాగస్వామ్యంతో ఉద్యమం ఉప్పెనై ఎగసింది. తొలిదశ ఉద్యమ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని హింసకు తావులేకుండా వ్యూహాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ శాంతియుతంగా సాగిన పోరాటం ఎట్టకేలకు విజయం సాధించింది. మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల కల నెరవేరింది. సరిగ్గా పదేండ్ల కింద 2014, జూన్ 2న తెలంగాణ రాష్ట్రంగా అవతరించింది.

### స్వీయపాలనలో పునర్నిర్మాణం

రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత స్వీయపాలనకు అంకురార్పణ జరిగింది. అప్పుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్ ముందు తెలంగాణ అస్తిత్వ ఆకాంక్ష, ఉద్యమ నేపథ్యాలను గమనింపులో ఉంచుకోవాల్సిన అవసరం ప్రధానంగా ఉన్నాయి. ఎన్నికలు కాగానే ప్రభుత్వం ఏర్పడటం, కొన్ని మౌలికమైన అంశాల మేరకు పాలించడం సర్వసాధారణం. కానీ, తెలంగాణ విషయంలో మాత్రం ఈ మౌలిక సూత్రాలు పనిచేయవు. విశాలాంధ్ర పేరుతో 60 ఏండ్లుగా తెలంగాణలో భౌతిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక చివరికి రాజకీయం సహా అన్ని రంగాలు విస్మరణకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో ఆలోచిస్తే తప్ప నవ తెలంగాణ బంగారు తెలంగాణగా మారడానికి బ్లూ ప్రింట్ ఎలా ఉండాలో అర్థం కాదు. అందుకే కేసీఆర్ సర్కారు... తెలంగాణ పునరావిష్కరణ (రీఇన్వెంట్),



పునర్నిర్మాణం (రీకన్‌స్ట్రక్షన్) అంశాలను పునాదిగా రాష్ట్ర నిర్మాణాన్ని మొదలుపెట్టింది. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ అస్తిత్వాన్ని గుర్తించడానికి నిరాకరించాయి. తెలంగాణ అభివృద్ధిని చిన్నచూపు చూశాయి. రాష్ట్రంగా ఏర్పడేనాటికి తెలంగాణలో 10 జిల్లాల్లో హైదరాబాద్ మినహా మిగిలిన తొమ్మిది జిల్లాలు వెనకబడిన జిల్లాల జాబితాలో ఉండటం శోచనీయం.

ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ పునరావిష్కరణ, పునర్నిర్మాణం దిశగా ముందుకు సాగటం ప్రభుత్వానికి కత్తిమీద సాము వ్యవహారమే. దీనికోసం కేసీఆర్... లక్ష్యాలను తక్షణం, స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలికమైనవిగా విభజించుకున్నారు. వనరుల లభ్యత, వాటి సద్వినియోగం, ధ్వంసమైన వనరుల పునరుద్ధరణ ద్వారా తెలంగాణకు ఉపశమనం కలిగించడం అనే వ్యూహంతో ఆయన ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకున్నది. ఇందులో భాగంగా మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం, భక్తరామదాసు, సీతారామ, పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల మొదలైన బృహత్తర కార్యక్రమాలను తలకెత్తుకుంది. వ్యవసాయం, పరిశ్రమలు సాఫీగా సాగిపోవడానికి నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చింది. హైదరాబాద్‌కు సమాంతరంగా